క్లుప్తంగా

ఈ-క్రాప్ బుకింగ్ తప్పనిసరి

యాదమరి: ప్రతి రైతు ఈ-క్రాప్ బుకింగ్ తప్పనిసరిగా చేయించుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీఏ ఉమ తెలిపారు. బుధవారం ఆమె మండల పరిధిలోని పత్రపల్లి రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి విత్తనాలు నాటే సమయంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ప్రాధాన్యతను వివరించారు. అనంతరం ఆకుల మడత పురుగు, రసం పీల్చే పురుగు ప్రభావం చేత నష్టపోయిన వేరుశనగ పంటను సందర్శించి రైతుకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి దీప, సిబ్బంది పాల్గొన్నారు.

జేఏఓగా విద్యాసాగర్


విద్యాసాగర్‌ను సన్మానిస్తున్న పీఓ రెడ్డెప్ప, ఉద్యోగులు

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో చిత్తూరు అర్బన్ డివిజన్ ఏడీఎం విభాగం సీనియర్ సహాయకులు విద్యాసాగర్‌కు పదోన్నతి వచ్చింది. డిప్యూటేషన్‌పై ఎస్‌ఈ కార్యాలయంలో పనిచేస్తున్న ఆయనకు అక్కడే జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ (జేఏఓ)గా ఉద్యోగోన్నతి లభించింది. ఈ సందర్భంగా పర్సనల్ ఆఫీసర్ రెడ్డెప్ప, ఇతర ఉద్యోగులు సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

రాత్రి సమయంలో పొలాల వద్ద ఉండవద్దు

ఐరాల: మండలంలోని అటవీప్రాంత సరిహద్దు గ్రామాల్లో రైతులు రాత్రి సమయంలో పొలాల వద్ద ఉండకూడదని మండల అటవీశాఖాధికారి రాకేష్‌కుమార్ ఓ ప్రకటనలో సూచించారు. బుధవారం నాగవాండ్లపల్లె నుంచి నెల్లిమంద పల్లె, యాదచెరువు అటవీ సరిహద్దు ప్రాంతాల్లో ఏనుగుల గుంపు సంచరిస్తున్నట్లు తెలిపారు. అందువల్ల అటవీప్రాంత సరిహద్దు గ్రామాలైన దివిటివారిపల్లె, వినాయకపురం, నయనంపల్లె, బసివిరెడ్డిఇండ్లు, ఐకే రెడ్డిపల్లె, పీ.యల్లంపల్లె, బెల్లంగోవిందరెడ్డిపల్లె, కట్టకిందపల్లె ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఏనుగుల గుంపు గురించి ఏదైనా సమాచారం తెలిస్తే వెంటనే 9490736196కు సమాచారం ఇవ్వాలని తెలియజేశారు.

స్కూల్ బస్సు సీజ్



పుంగనూరు(చౌడేపల్లె): ప్రైవేట్ బస్సులు కండీషన్‌లో ఉండాలని ఎంవీఐ సుప్రియ తెలిపారు. ఆమె బుధవారం పుంగనూరు పట్టణంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఆమె మాట్లాడుతూ పర్మిట్, ట్యాక్స్ పర్మిషన్లు లేని కర్ణాటక రిజిస్ట్రేషన్ కలిగిన బస్సును సీజ్ చేశామన్నారు. పట్టణంలోని పాఠశాలల యజమానులు తమ స్కూల్ బస్సులకు 5 సంవత్సరాలు డ్రైవింగ్ అనుభవం కలిగిన డ్రైవర్లను నియమించుకోవాని సూచించారు. పరిమితికి మించి పిల్లలను ఎక్కించుకోవద్దని సూచించారు. పట్టణంలో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, పిల్లలు రోడ్డు దాటే సమయంలో తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

రేపటి నుంచి కిండర్ కేర్ స్కూల్ అడ్మిషన్లు

పలమనేరు: పట్టణంలోని కిండర్ కేర్ మానసిక వికలాంగ పిల్లల బడిలో శుక్రవారం నుంచి అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ అవకాశాన్ని 6 నుంచి 9 ఏళ్లలోపు శారీరక, మానసిక వికలాంగ పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాల కోసం 8897506631 ను సంప్రదించాలని తెలిపారు.

బడికి దారి చూపితేనే పంపుతాం

రొంపిచెర్ల: దారి చూపితేనే పిల్లలను బడికి పంపుతామని, లేకుంటే ఇంటి వద్దే ఉంచుకుంటామని విద్యార్థుల తల్లిదండ్రులు తెగేసి చెప్పారు. మండలంలోని బండకిందపల్లె పాఠశాలకు విద్యార్థులు బుధవారం కూడా హాజరుకాలేదు. ఉపాధ్యాయులు తల్లిదండ్రుల వద్దకు వెళ్లి ఎంత చెప్పినా ఫలితం లేదు. ఈ విషయాన్ని కొందరు విద్యార్థుల తల్లిదండ్రులు టీడీపీ నేత చల్లా రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన అక్కడికి చేరుకుని పరిశీలించారు. బండకిందపల్లె పాఠశాలలో 54 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని తెలిపారు. వీరిలో 40 మంది నేషనల్ హైవే దాటుకుని రావాల్సి ఉందన్నారు. బడికి దారి లేకపోవడంతో 40 మంది విద్యార్థులను తల్లిదండ్రులు బడికి పంపడం లేదని తెలిపారు. వారికి మద్దతుగా మిగిలిన 14 మంది విద్యార్థులు కూడా బడికి హాజరుకావడం లేదని చెప్పారు. బడికి విద్యార్థులు వచ్చేందుకు తాత్కాలికంగా దారి వేస్తామని నేషనల్ హైవే వారు చెప్పినా తల్లిదండ్రులు ఒప్పుకోలేదు. శాశ్వతంగా బడికి దారి చూపితేనే పిల్లలను పంపుతామని చెప్పడంతో చల్లా రామచంద్రారెడ్డి నేషనల్ హైవే సూపర్‌వైజర్‌తో మాట్లాడి 150 మీటర్ల దూరం రోడ్డు వేసి ఇబ్బంది లేకుండా చేయాలని సూచించారు. దీనికి నేషనల్ హైవే వారు రోడ్డు వేసేందుకు అంగీకరించారు. విద్యార్థులు గురువారం కూడా పాఠశాలకు వస్తారో లేదో వేచి చూడాలి.

గ్రామీణ రహదారుణాలు


కోతకు గురైన రోడ్డు


జి.గొల్లపల్లె నుంచి ముచ్చుకాలువ వరకు అడుగడుగునా గోతులు ఏర్పడిన రోడ్డు

గ్రామీణ రోడ్లకు గ్రహణం పట్టింది. వర్షాల సమయంలో పల్లె ప్రజల కష్టాలు వర్ణనాతీతం. ప్రయాణం చేయాలంటే సాహసించాల్సిందే. పల్లెప్రగతిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని వాగ్దానాలు చేసిన కూటమి ప్రభుత్వం ఏడాది గడచినా గ్రామీణ రోడ్లకు మోక్షం రాలేదు. ప్రస్తుతం రోడ్ల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంలా ఉంది. తవణంపల్లె మండలంలో గ్రామీణ రోడ్లు దారుణంగా ఉన్నాయి. పల్లెలను కలిపే లింకు రోడ్లు దుస్థితికి చేరాయి.

- కూటమి ప్రభుత్వంలో గ్రామీణ రోడ్లకు గ్రహణం
- దుస్థితికి చేరుకున్న రోడ్లతో ప్రయాణికులకు అవస్థలు
- అడుగుఅడుగునా గుంతలమయం
- ఇబ్బందులు పడుతున్న వాహనచోదకులు

తవణంపల్లె: కూటమి ప్రభుత్వం వచ్చిన రోజు నుంచి పల్లెల్లో పాలన కుంటుపడింది. గత ప్రభుత్వ హయాంలో ప్రతి సచివాలయానికి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసి పల్లెల అభివృద్ధి కృషి చేసింది. రోడ్లు, మౌలిక సదుపాయాల కల్పనకు ఆ నిధులను వినియోగించేవారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక పల్లెలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో విఫలమవుతోంది. చాలా గ్రామాలకు వెళ్లే రోడ్లు గుంతలు పడి, కంకర తేలాయి. వర్షాకాలంలో ఆ రోడ్లలో ప్రయాణం నరకమే.

దుస్థితిలో మచ్చుకాలువ లింకు రోడ్డు ..

మండలం నుంచి సోమల మండలంలోని పల్లెలను కలిపే లింకు రోడ్డు అడుగు అడుగునా గుంతలమయమైంది. కన్ను మూస్తే ఏ గుంతలో పడతామోననే భయంతో వాహనాదారులు అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని వాహనాలు నడుపుతున్నారు. రోడ్డు పూర్తిగా కోతకు గురై వాహనాలు తొలగాలన్నా ఇబ్బంది పడుతున్నారు. రోడ్డుపై కంకర తేలి ప్రజలు, వాహనాలు వెళ్లలేక నానా తిప్పలు పడుతున్నారు. అదేవిధంగా చిగరాకులపల్లె నుంచి తంబుగానిపల్లె వరకు ఉన్న లింకు రోడ్డు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఎగువ మోదలపల్లె నుంచి సంక్రాంతి పల్లె వరకు ఉన్న లింకు రోడ్డు అధ్వానంగా మారింది. రోడ్ల అభివృద్ధి గురించి ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. అదేవిధంగా కాణిపాకం బ్రిడ్జి నుంచి అరగొండ-చిత్తూరు రోడ్డు వరకు ఉన్న లింకు రోడ్డు గంతలమయమైంది. దీంతో రాత్రివేళల్లో వాహనాలు నడపడానికి అవస్థలు పడుతున్నారు.


కంకరతేలిన కొండకిందకనికాపురం రోడ్డు

కంకర తేలిన రోడ్లలో ప్రమాదాలు..

మండలంలోని పలు రోడ్లలో గుంతలు ఏర్పడడంతో ఎప్పుడు ప్రమాదాలు జరుగతుందోనని భయాందోళనకు గురవుతున్నారు. మండలంలోని రామకృష్ణాపురం రోడ్డు, కొండకిందకనికాపురం రోడ్డు కంకర తేలి సుమారు ఏడేళ్లుగా అభివృద్ధికి నోచుకోవడం లేదు. అదేవిధంగా టి.పుత్తూరు రోడ్డు కూడా అధ్వానంగా ఉంది.

ముచ్చుకాలువ రోడ్డుకు మోక్షం ఎప్పుడో



జి.గొల్లపల్లె నుంచి ముచ్చుకాలువ రోడ్డు అధ్వానంగా ఉంది. ఈ రోడ్డును బాగు చేయాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకొచ్చినా పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వంలో అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డును బాగు చేయాలి.

–వెంకటరమణ, జి.గొల్లపల్లె

నాలుగు రోడ్లు మంజూరు..



మండలంలో పల్లెచెరువు, లక్ష్మీనారాయణపురం, కొండకిందకనికాపురం, రామకృష్ణాపురం రోడ్లకు తారురోడ్డు నిర్మించడానికి నిధులు మంజూరయ్యాయి. పల్లెచెరువు, లక్ష్మీనారాయణపురానికి తారు రోడ్డు నిర్మాణం పనులు పూర్తయ్యాయి. మరో రెండు రోడ్లు పనులు జరగాల్సి ఉందన్నారు. మిగిలిన రోడ్లకు రానున్న ఆర్థిక సంవత్సరంలో నిధులు మంజూరవుతాయని వివరించారు.

–జయచంద్రారెడ్డి, పీఆర్ ఏఈ, తవణంపల్లె

అధినేతతో భేటీ


మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన హవీష్‌రెడ్డి

ఐరాల: తాడేపల్లిలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మండలానికి చెందిన సోషల్ మీడియా కార్యకర్త హవీష‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. సోషల్ మీడియాలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను, మోసాలను ఎండగట్టాలని జగనన్న సూచించారని హవీష్‌రెడ్డి తెలిపారు. సోషల్ మీడియా యాక్టివిస్టులకు పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా నిచ్చారని చెప్పారు.

వృద్ధాప్యంలో జాగ్రత్తలు పాటించండి


దిగువమాఘంలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ కేశవనారాయణ

తవణంపల్లె: వృద్ధాప్యంలో ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా చూసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ కేశవనారాయణ తెలిపారు. బుధవారం మండలంలోని దిగువమాఘంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 43 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు ఇచ్చారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి ఉచితంగా మందులను అందజేశారు. వృద్ధాప్యంలో ఆరోగ్యపరంగా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గర్భిణులు రక్తహీనత రాకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మళ్లీ.. కొత్తవి పెట్టారోచ్..


కమాండర్ రోప్ వద్ద ఆడుకుంటున్న పిల్లలు


అడ్వెంచర్ రోప్‌లో ఆడుకుంటున్న చిన్నారులు

చిత్తూరు కార్పొరేషన్: నగరంలోని అటవీశాఖ పిల్లలపార్కులో కొత్త ఆటవస్తువులను ఏర్పాటు చేశారు. సెలవుల్లో కుటుంబ సభ్యులతో ఆహ్లాదంగా గడపడానికి ఇక్కడికి అధిక సంఖ్యలో నగరవాసులు వస్తుంటారు. కానీ ఆశించిన స్థాయిలో సౌకర్యాలు లేవు. ఎప్పుడో ఏర్పాటు చేసిన వస్తువులు పాడవగా.. కొత్తవి ఏర్పాటు చేయలేదు. గతంలో పార్కు వైపు వెళ్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ సమస్యను గుర్తించి డీఎఫ్‌ఓ భరణితో మాట్లాడారు. నూతన ఆటపరికరాల నివేదిక కోరారు. ఆమె ఆదేశాల మేరకు ఎఫ్‌ఆర్వో థామస్ ఏర్పాటుకు అవసరమైన ఆటవస్తువుల వివరాలను అందజేయడంతో కలెక్టర్ నిధుల నుంచి రూ.9.90 లక్షలు మంజూరు చేశారు. దీంతో ఇక్కడ నూతనంగా కమాండో స్లైక్, రోప్‌వే, త్రీస్లెప్స్, బ్యాలెన్సింగ్ వాక్, నెంబర్‌వాక్‌తో పాటు పలు పరికరాలకు పెయింటింగ్ వేశారు. దీంతో పాటు టాయిలెట్స్, విద్యుత్ మరమ్మతు పనులు, టికెట్ కౌంటర్‌ను ఏర్పాటు చేయడంతో పిల్లలు ఆనందంగా అక్కడ ఆడుకుంటున్నారు.


బ్యాలెన్సింగ్ వాక్..


నంబరింగ్‌లో


త్రీ స్టెప్స్ ఆడుతూ..

సమగ్ర యాజమాన్య పద్ధతులపై అవగాహన


పంటలను పరిశీలిస్తున్న ఏఈఓలు

ఐరాల: ఖరీఫ్ పంటల సాగులో రైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏఈఓలు శైలజ, ఆనంద్ తెలిపారు. బుధవారం మండలంలోని ఎగవచవటపల్లె, పుల్లూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల పంటల సాగులో వ్యవసాయాధికారుల సూచనల మేరకు సాగు చేసుకుంటే మంచి దిగుబడులు సాధించవచ్చన్నారు. వేరుశనగ, కంది సాగు చేసే రైతులు విత్తనశుద్ధి తప్పక పాటించాలన్నారు. పంటలపై పురుగు మందులు పిచికారీ చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే శరీర భాగాలపై దుష్ప్రభావం చూపుతాయని సూచించారు. సరైన రక్షణ కవచాలు లేకుండా పురుగుమందు పిచికారీ చేయకూడదన్నారు. అనంతరం బోరు బావుల కింద సాగు చేసిన వరి పంటను పరిశీలించి రైతులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో వీఏఏలు పాల్గొన్నారు.

లఘు వైష్ణవీదేవి అలంకరణలో అమ్మవారు



చౌడేపల్లె: మండలంలోని పుదిపట్ల సమీపంలో వెలసిన వైష్ణవీదేవి ఆలయంలో నిర్వహిస్తున్న వారాహి నవరాత్రుల్లో భాగంగా బుధవారం అమ్మవారిని లఘువైష్ణవి దేవి అలంకరణలో కొలువుతీర్చారు. అర్చకురాలు శ్రావణిరెడ్డి ఆధ్వర్యంలో అమ్మవారిని అత్యంత సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని సౌందర్య లహరి పారాయణం చేశారు.

పోషకాల రాగి


బంగారుపాళెంలో సాగు చేసిన రాగి పంట

ప్రధాన ఆహార పంటల్లో రాగి పంట ఒకటి. చిరుధాన్యం పంటగా రాగి పండిస్తారు. ఖరీఫ్, రబీ సీజన్లతో పాటు వేసవిలో కూడా రాగి సాగు అధికంగా చేస్తారు. రాగిలో క్యాల్షియం అధికంగా ఉండడం, కొవ్వుపదార్థాలు తక్కువగా ఉండడం, పీచుపదార్థం కావడం, వరి, గోధుమల కంటే పోషకాల శాతం ఎక్కువ ఉన్న మంచి పౌష్టికాహారం కావడంతో ఇటీవల కాలంలో రాగి వినియోగం పెరిగింది. దీంతో రాగి సాగు విస్తీర్ణం ప్రస్తుతం పెరిగింది. ప్రభుత్వాలు కూడా రాగి పంటకు మద్దతు ధర కల్పించడంతో రైతులు లాభాలు పొందుతున్నారు.

- రాగి సంగటి, జావపై మక్కువ చూపుతున్న ప్రజలు
- మార్కెట్‌లో పదార్థాలకు డిమాండ్
- ఆశాజనకంగా ధరలు
- పెరిగిన పంట సాగు
- మధుమేహ వ్యాధిగ్రస్తులకు దివ్యౌషధం

బంగారుపాళెం: నియోజకవర్గంలో రైతులు చిరుధాన్యాల పంటల సాగుపై దృష్టి సారించారు. ముఖ్యంగా రాగి పంట సాగుపై ఆసక్తి చూపుతున్నారు. నీటి తడులకు అవకాశం ఉన్న రైతులు రాగి పంటతో పాటు వేరుశనగ సాగు చేస్తున్నారు. ప్రస్తుతం రాగులకు మంచి గిరాకీ ఉంది. గతంలో గ్రామాల్లో రాగి, జొన్న, సజ్జ, కొర్ర, సామ, అరికె పంటలు సాగు చేసేవారు. క్రమంగా ఆయా పంటల సాగు తగ్గుతూ వచ్చింది. ప్రస్తుతం కొన్ని గ్రామాల్లో రాగి, కొర్ర పంట సాగు చేస్తున్నారు. గ్రామాల్లో మధ్యాహ్నం రాగి సంగటి వాడుతున్నారు. హోటళ్లలో కూడా రాగిసంగటి అందుబాటులో ఉంటోంది. షుగర్ వ్యాధిగ్రస్తులు ఎక్కువగా రాగి సంగటి తినడానికి ఇష్టపడుతున్నారు. దీంతో రాగి ధాన్యానికి డిమాండ్ పెరిగింది. వరి కోసిన తరువాత రాగిపంట సాగు చేస్తున్నారు. రాగులు కిలో రూ.30 నుంచి రూ.40 వరకు ధర పలుకుతోంది. దీంతో రాగి పంట సాగుతో మంచి లాభాలు రాబడుతున్నారు.

అధిక దిగుబడినిచ్చే రకాలు..

రాగి పంటలో అధిక దిగుబడినిచ్చే రకాల్లో మేలైన రకం మారుతిరకం. ఈ రకం పంట 85 రోజుల నుంచి 90 రోజుల్లో దిగుబడి వస్తుంది. తెగుళ్లను తట్టుకుని 10 క్వింటాళ్ల వరకు దిగుబడి ఇస్తుంది. అన్ని ప్రాంతాల్లో సాగు చేసేందుకు వీలుగా ఉంటుంది. మిగతా రకాలైన వేగావతి, సువర్ణముఖి, వకుళ, భారతి, హిమ, శ్రీచైతన్య రకాలు కూడా అధిక దిగుబడినిస్తాయి.

విత్తనశుద్ధి ఇలా..

రాగి పంట సాగు చేసే సమయంలో విత్తనశుద్ధి అవసరం. కిలో విత్తనానికి 2 గ్రాముల కార్బండిజం అనే మందు కలిపి విత్తనశుద్ధి చేయడం ద్వారా పంటకు తెగుళ్లు సోకకుండా ఉంటాయి. నారు నాటే పద్ధతిలో అయితే ఒక ఎకరానికి నారు కావాలంటే 2 కేజీల విత్తనాన్ని 5 సెంట్ల భూమిలో నారుమడిలో పోయాలి. 21 రోజుల తరువాత నారు నాటాలి. పొలం దున్నిన తరువాత ఆఖరి దుక్కిలో మూడు నుంచి నాలుగు టన్నుల పశువుల ఎరువులు వాడాలి. ఖరీఫ్‌లో వర్షాధారంగా పండించే రాగి పంటకు 24 కిలోల నత్రజని, 12 కిలోల భాస్వరం, 8 కిలోల పొటాషియం వేయాలి. అగ్గి తెగుళ్ల నివారణకు ట్రై సైక్లోజెల్ 6 గ్రాములను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. వెర్రి తెగులు నివారణకు 2 గ్రాముల మెటలాక్సిల్‌ను లీటరు నీటిలో కలిపి స్ప్రే చేస్తే సరిపోతుంది. కాండం తొలిచే పురుగు నివారణకు కొరాజిన్ 3 మిల్లీలీటరును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఈవిధంగా పంట సస్యరక్షణ చేస్తే పంట అధిక దిగుబడి వస్తుందని వ్యవసాయ అధికారులు వెల్లడిస్తున్నారు.

రాగితో ఆరోగ్యం..

రాగి ఆహారంగా తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చు. రాగులతో చేసే సంగటి, రాగి జావ, రొట్టె తీసుకోవడం ఎంతో మంచిది. రాగులు 100 గ్రాములు తీసుకుంటే, అందులో 344 మిల్లీ గ్రాముల క్యాల్షియం, 328 క్యాలరీలు, 3,6 గ్రాముల పీచు పదార్థాలు, 7.3 గ్రాముల ప్రోటీన్ లభిస్తుంది. అందుకే పూర్వం ఎక్కువగా రాగులతో చేసిన పదార్థాలే తినేవారు. రాగి జావ తాగితే రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు అదుపులో ఉంటాయి. రాగులు వాడకంతో బరువు తగ్గుతారు.

చికిత్స పొందుతూ కార్మికుడు మృతి


మృతి చెందిన కార్మికుడు

బంగారుపాళెం: ప్రమాదంలో గాయపడిన బెంగాల్ వాసి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఏఎస్ఐ మల్లప్ప తెలిపారు. మండలంలోని మొగిలివారిపల్లె వద్ద చెన్నై-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే రోడ్డు పనులు జరుగుతున్నాయి. బెంగాల్ రాష్ట్రం సతీష్‌నగర్‌కు చెందిన దయాల్‌మండల్ కుమారుడు ఆశీష్‌మండల్(31) గ్రామస్తులతో కలసి ఏడాది క్రితం పనులు చేసేందుకు వచ్చాడు. బ్రిడ్జి పనులు చేస్తుండగా మంగళవారం ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. దీంతో తలకు బలమైన గాయం కావడంతో సహచర కార్మికులు గాయపడిన ఆశీష్‌మండల్‌ను ప్రథమ చికిత్స నిమిత్తం బంగారుపాళెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి ప్రమాదకరంగా ఉండడంతో మెరుగైన వైద్యం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ చెప్పారు.